# అరణ్యరోదనం

శ్రీ వి. సుబ్బయ్యదేవర

ఆ ప్రదేశం క్షుద్రజీవులకు ఆలయం! కీచురాళ్ల శృతితో భయానక ప్రకృతి! ఆయిండ్లమీద నుంచి నిట్టూర్పు ధ్వనులే వినబడుతాయి. ఆర్తనాదంతో నిరాధారులై జీవితాంతానికి స్వాగత మిస్తున్నారా పేద జీవులు. ఆ కొంపలచుట్టూ వున్న వాతావరణం ఎట్టి మానవునికైనా రోత కలిగించేది. దుర్భరమైన కంపు— అన్నీ కుళ్లుగోతులు—పంతులు, కుక్కలు మానవులతో సమానంగా, నివసిస్తూవున్న లోకం అది—

ఆలోకంలోనుంచి బయలుదేరా డొక దరిద్ర నారాయణుడు. తేనెతుట్టులాంటి గడ్డం, కరుడుగట్టిన ఆ జుట్టూ, పాలిపోయిన ఆముఖం, లొట్టపోయిన ఆ కండ్లు, ఆ చింపిరి గుడ్డలు చూస్తే చాలా జాలికరంగా వున్నాయి.

అవి క్రిస్టమస్ రోజులు. ఆ హోటలుముందు విద్యుద్దీప తోరణాలు మెరసిపోతున్నాయి. మంగళ వాయిద్యములు మ్రోగుచున్నవి. కోలాహలం చూసి ఆభవనం ముందు చేరాడా గర్భధరిద్రుడు వచ్చిపోయే వారందరముందు చేయిజూపి యాచిస్తున్నాడు.

వివిధ తరంగాలతో ముస్తాబు లయిన యువకులు—వర్తకులు— పెద్ద మనుష్యులు— కొందరు 'బ్రేవు' అని త్రేనుస్తూ, వెళ్ళిపోతుంటారు— కాని ఆ హృదయంలోని ఆదేదను— ఆరాటం— ఎవరికావాలి—? మహా సముద్రఘోషలావున్న ఆ గొడవలో ఏం వినబడుతాయి ఆ బిచ్చగాని నీరస కంఠాలాపాలు!

"పాడులోకం—వందలు వేలు—వ్యసనాలకై వెచ్చించ గలిగినవారు—ఆకలి మంటతో అలమటించిపోయె నిరుపేదకు కాని డబ్బివ్వలేరు—దినమంతా తిరిగినాకాని డబ్బివ్వగల మహనీయుడు లేడా—ఈ విశాల ప్రపంచములో—పాడు ప్రపంచం, గ్రుడ్డిలోకం అంటూ సాగిపోయినాడా భగ్న హృదయుడు.

రాత్రి...చలిగాలి మిక్కుటంగా వీస్తుంది. మిద్దెలలో నివశించేవారే చలికి ఆరాత్రి అంత బాధపడుతోంటే ఇంక ఆరుబయట, ప్రేమ కౌగిళ్లలో నిద్రించే వారిగతి...?

"ఒక కబళం పెట్టు! తల్లీ! ఆకసితో...' ఇంక ఆ బిచ్చగాడి విలాపాలకి అంతులేదు.

'ఛీ. వెధవా, వానలో ధర్మమేమిట్రా' అంది ఒక యిల్లాలు.

'ఎద్దులాగున్నావ్, ముష్టెత్తుకుంటున్నావు. సిగ్గులేక' అన్నాడు ముసలి తొక్క, యింట్లో కాలువకప్పకొంటూ.

'నీకు ఒకసమయం అంటూ లేదు? అన్నది ఒక మహాతల్లి.

తిండివున్న వాళ్లకి ఒక సమయాలంటూ నోచుమాలుగాని తిండిలేని వారికి...?

దూరాన ఎక్కడనో ప్రకాశించే నక్షత్ర కాంతిని ఆధారం చేసుకొని తన అదృష్టాన్ని. వెతుక్కుంటూపోతున్నాడా అభాగ్య జీవి...

"అమ్మాపిడికెడన్నం—అనిఅంటూ అన్నివీధులు తిరిగినాడు చాలాచోట్ల నిశ్శబ్దం చేతా, మిగిలిన చోట్ల కసరి కొట్టడాలు చేత అదరింప బడ్డాడు. కాని అతని ఆవేధన—ఆరాటం—ఎవరు గ్రహించగలినారు.

మలమల మాడే ఆకలి మంటతో, గాలి తాపిడికి తాళజాలక, తల్లడిల్లుతూ, ఆకలిబాధకు నీరసంచేత నిలువలేక ఒక వీధియరుగు మీదికి చేరాడు. అప్పుడే కిటికి తెరచి కాల్చిన సిగరెట్టు పికను అతనిమీద పడవైచి కాండ్రించి వుమ్మివూశాడు వుద్యోగి. 'గ్రుడ్డి లోకం గ్రుడ్డి ప్రపంచము' అని లేవబోయి మురికికాలువలో పడిపోయినా దరిద్రుడు.

ప్రపంచ మంతా నిద్రపోతున్నది. కాళరాత్రి భీభత్సముగా నృత్యం చేస్తుంది. ప్రకృతిశక్తి ఆకలి బాధతో ఘోరయుద్ధం చేస్తుంది. ఆ భయంకర గర్భనలోనుంచి, ఆ గాడాంధ కారంలోనుండి నిష్ఫల్పం అయ్యో ఒక చిన్న గొంతుక—...

ప్రకృతి నంతా సంక్షోభ పెట్టేఒక క్షుద్రవిలాపం...ధనమదాంగ్నికి ఇంధనమయ్యో వాగమృతి—!

'అయ్యో! నా మొరాలకించరా!'

అతని నిట్టూర్పులు వాయు స్వనంలో విలీనమయి పోతాయి ఉస్సురంటూ ఆ కాలువలోనే దీర్ఘ నిద్రపోయినాడు. శశాంకుడు యీ దృశ్యాని చూడలేక మబ్బు తెరచాటుకు వెళ్ళిపోయినాడు. పవిత్ర పుణ్యభూమి యని విర్రవీగే భారతభూమి నేడు గొడ్డుపోయింది.

ఇలాంటివారు ఎంతమం దున్నారో ప్రపంచములో! వాళ్ల దీనాలాపాలు ఎవరికేనా వినబడుతుతున్నాయా? యీ అభాగ్యుల సంగతి సంఘం ఏమన్న ఆలోచిస్తుందా? లేకపోతే వారి ఆర్తనాదాలు అరణ్యరోదనాలేనా???